ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

కర్ణాటక వార్తలు
మంగళవారం 23 సెప్టెంబరు 2025


పాదపూజ చేస్తున్న యువరాణి త్రిషికా

రాచరిక సంప్రదాయాలతో ప్యాలెస్‌లో దసరా

బెంగళూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నవరాత్రి వేడుకలను మైసూరు ఒడయార్ రాజవంశస్థులు సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. ఈ సంప్రదాయం శతాబ్దాలకాలంగా వస్తోంది. మైసూరులోని అంబా విలాస్ ప్యాలెస్‌లో రెండు రోజులుగా వందలాదిమంది కార్మికులు ఏర్పాట్లు చేశారు. యువరాజును బహుపరాక్ అంటూ సైనికులు ఆహ్వానించారు. ఉదయం (మిగతా 7వ పేజీలో..)


అలంకరణలో చాముండేశ్వరి మాత

కొండంత పండుగ

- అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం
- శోభాయామానంగా చాముండి కొండ • మైసూరు వీధులు కిటకిట
- అలరించిన కుస్తీ పోటీలు, పూల ప్రదర్శనలు
- చాముండేశ్వరి కృపతోనే ఈ అవకాశం : బానుముస్తాక్
- ఆమె మతం కాదు.. మానవతావాదిగా చూడండి : ముఖ్యమంత్రి
- ప్యాలెస్‌లో ప్రైవేట్ దర్బార్ నిర్వహించిన యువరాజు ఒడయార్

బెంగళూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): చాముండి కొండపై పండుగ వాతావరణ నెలకొంది. అడుగడుగునా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. దేశంలోనే ప్రతిష్ఠాత్మకంగా భావించే మైసూరు దసరా ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం తెల్లవారుజామునుంచే చాముండేశ్వరి ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి. 10 గంటలకు చాముండి కొండలకు చేరుకున్న సీఎం సిద్దరామయ్య, బుకర్ ప్రైజ్ విజేత బానుముస్తాక్‌లతోపాటు పలువురు చాముండేశ్వరిదేవిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వెండిరథంపై కొలువుదీరిన అమ్మవారికి పుష్పార్చన చేయడం ద్వారా బానుముస్తాక్ దసరా ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం బహిరంగసభను ఉద్దేశించి ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రసంగించారు. మధ్యాహ్నం కుస్తీ పోటీలు, పూల ప్రదర్శనలు ప్రారంభించారు. మరోవైపు మైసూరు ప్యాలెస్‌లో ఒడయార్ రాజసంప్రదాయాలకు అనుగుణంగా పూజలు చేశారు. మైసూరులో దసరా ఉత్సవాల తొలిరోజు అంగరంగ వైభవం అనిపించింది. ఎటుచూసినా పండుగ వాతావరణం కనిపించింది.



శక్తికి సంకేతం చాముండేశ్వరి దేవి

చాముండేశ్వరి దేవి శక్తి, ధైర్యం, మమత రక్షణకు సంకేతమని బుకర్ ప్రైజ్ విజేత బానుముస్తాక్ అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది ఉత్సవాల ప్రారంభానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఆమె చాముండిదేవికి పుష్పార్చన చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మైసూరు దసరా పవిత్ర ఉత్సవాల ప్రారంభం పవిత్ర సమయంలో చాముండిమాత కృపా కటాక్షంతో మీ అందరిముందు నిలబడే అవకాశం తన జీవితంలో దక్కిన అత్యంత గౌరవక్షణమన్నారు. ఈ ప్రాంత వాసిగా గర్వపడుతున్నానన్నారు. మైసూరు రాజులు సంస్కృతి పరంపరను కాపాడారన్నారు. కన్నడభాష అంతర్భాగ హృదయస్పందన వరకు ఈ పండుగ స్మరణీయమన్నారు. సంస్కృతి అంటే వేర్వేరు ధ్వనులని, సంగమం, భిన్నత్వంలో ఏకత్వమన్నారు. రాజు జయచామరాజేంద్ర ఒడయార్ ముస్లింలపై నమ్మకంతో అంగరక్షకులుగా పెట్టుకున్నారన్నారు. ఇది గర్వకారణమన్నారు. సంస్కృతి అంటే హృదయంలో పుట్టే ధార్మిక నమ్మకాలన్నారు. ఈ గడ్డపై సంస్కృతి మూలం అంటే అందరినీ గౌరవించే మనందరి 'సర్వజనాంగద శాంతియతోట' అని కొనియాడారు. మైసూరు దసరా మనందరి చెవుల్లో ప్రతిధ్వనించాలన్నారు. ఇది శాంతిపండుగ అని, సౌహార్థ మేళా అన్నారు. ప్రజాప్రభుత్వ విలువలను గౌరవించి పరస్పర సంస్కృతి, నమ్మకాలను గౌరవించడం ద్వారా మన జీవితం గొప్పగా తీర్చుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో ఎండకూడా మానవ అభిమానానికి ప్రతీక అన్నారు. చాముండేశ్వరి దేవి మహిమ మనందరి జీవనానికి మార్గదర్శకం కావాలన్నారు. మన రాష్ట్రానికి దేశానికే కాకుండా మానవజాతికి శాంతి, సానుభూతి, న్యాయదీపాన్ని వెలించాలని కోరుకుటున్నానన్నారు. నా జీవనం అనేక పాఠాలను నేర్పిందని, అందులో ఒక వ్యక్తి నుంచి సమష్టిగా సాగే దారి మాత్రమే నిజమైన మార్గంగా ఉందన్నారు. తన ధార్మిక నమ్మకాలు జీవితాంతం కొనసాగుతాయన్నారు. ప్రస్తుత ప్రపంచం యుద్ధాలతో రగులుతోందని, ఇది మనుషుల మధ్య ద్వేషం, రక్తపాతంతో మునిగి ఉందన్నారు. దసరా పండుగ ద్వారా శాంతి సౌహార్ధత విశ్వవ్యాప్తం కావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఈనేల పరంపర, ఈ తోటలో ప్రతి పుష్పం రంగులతో వికసించాలని అలాంటి శాంతియుత వాతావరణం రావాలన్నారు. సంస్కృతి మన పూర్వమని, సౌహార్ధత, మన శక్తి, శిక్షణ ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ముస్లిం మహిళ, ముస్లిం ఆడబిడ్డ వాయనం పొందినప్పుడు తన మనసులోని భావాలు వ్యక్తం చేసే కవిత వినిపించారు. బాను ముస్తాక్‌ను సీఎం సిద్దరామయ్యతోపాటు జిల్లా యంత్రాంగం, మంత్రులు ఘనంగా సత్కరించారు. మైసూరు తలపాగా, శాలువాతో సన్మానం చేశారు.

ఒలింపిక్స్‌లో పతకం సాధిస్తే రూ.6 కోట్లు

రానున్న ఒలింపిక్స్‌లో రాష్ట్రానికి చెందినవారు పతకం సాధిస్తే 6 కోట్ల రూపాయలు ఇస్తామని సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. చాముండి విహార్ మైదానంలో దసరా సీఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా కుస్తీ క్రీడాకారిణి వినేశ్ ఫోగట్‌ను సత్కరించారు. క్రీడాకారులకు ప్రోత్సాహకం ఇస్తామని సీఎం తెలిపారు. ఉద్యోగాలలో 2శాతం, పోలీసుశాఖలో 3శాతం దాకా స్పోర్ట్స్‌కోటాలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి అన్నారు.

సంప్రదాయాలు పాటించిన బాను ముస్తాక్

దసరా ఉత్సవాల ప్రారంభించిన బాను ముస్తాక్ సంప్రదాయాలను పాటించారు. పసుపు పట్టుచీరలో, తలలో పూలు పెట్టుకున్నారు. చాముండేశ్వరి మూలవిరాట్టుకు పూజల వేళ హారతి తీసుకుని, తీర్థం సేవించారు. అక్కడి అర్చకులు ఇచ్చిన ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ అధికారులు పూలమాలతో సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో దసరా ఉత్సవాల ప్రారంభంలోనూ చాముండేశ్వరిదేవికి పుష్పార్చన చేశారు.


అంతర్జాతీయ రెజ్లర్ వినేశ్ ఫోగట్‌ను సన్మానిస్తున్న సీఎం

నాడహబ్బ విషయంలో రాజకీయాలు వద్దు: సీఎం



ఎన్నికల వేళ రాజకీయం చేద్దామని నాడహబ్బ మైసూరు దసరా విషయంలో అటువంటి కుత్ర రాజకీయాలు వద్దని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటైన బహిరంగసభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ దసరా మన సాంస్కృతిక గొప్పదనం పరిచయం లేనివారు బానుముస్తాక్‌ను వ్యతిరేకించారన్నారు. చరిత్రను మళ్లించి స్వార్థ రాజకీయాలకు అభ్యంతరం తెలపడం అపరాధమన్నారు. రాజకీయాలు ఎన్నికలలో మాత్రమే చేద్దామన్నారు. మైనారిటీ వర్గానికి చెందిన బాను ముస్తాక్ దసరా ప్రారంభించేందుకు అంగీకరించడం స్వాగతించే విషయమన్నారు. అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ విజేత ద్వారా ప్రారంభించడం తగినదన్నారు. బానుముస్తాక్ ముస్లిం మహిళ అనడం కంటే మానవతా విలువలు పాటించే వ్యక్తి అన్నారు. మనం మనుషులమని పరస్పరం అభిమానంతో ఉండాలన్నారు. ద్వేషం మానవత్వానికి వ్యతిరేకమన్నారు. రాజ్యాంగ విలువలు, కలసి జీవించే విధానమే భారతీయుల ఆశయమన్నారు. ఇదే హైకోర్టు, సుప్రీంకోర్టులు ఎత్తి చూపాయన్నారు. ఎవరు భారతీయులని గర్వపడతారో వారే రాజ్యాంగాన్ని గౌరవిస్తారన్నారు. మనం హక్కులతోపాటు బాధ్యతలు తెలుసుకోవాలన్నారు. జాతీయకవి కువెంపు గుడి, చర్చ్, మసీదులు వదిలి రావాలన్నారు. బీజేపీవారు గ్యారెంటీ పథకాలను విమర్శించారని, వారే ఇప్పుడు కాపీ చేస్తున్నారన్నారు. రెండేళ్లలో గ్యారెంటీలకు లక్ష కోట్లరూపాయలకుపైగా ఖర్చు చేశామన్నారు. ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం పెరిగిందన్నారు. దేశంలోనే జీడీపీలో నెంబరువన్‌గా ఉన్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప, కన్నడ సంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడిగ, పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి మునియప్పతోపాటు మైసూరు జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. మైసూరు నగరంతోపాటు చాముండి కొండలపైన పండుగ వాతావరణం కనిపించింది. ప్రతిచోటా దసరా శోభ వెల్లివిరిసింది.


మైసూరు దసరా ఉత్సవాల ప్రారంభోత్సవంలో సీఎం సిద్దరామయ్య, బానుముస్తాక్ తదితరులు

అరగంట సేపు కూర్చోలేరా..?

- సందర్శకులపై సీఎం ఆగ్రహం

మైసూరు దసరా ఉత్సవాల ప్రారంభం తర్వాత ఏర్పాటు చేసిన బహిరంగసభలో సీఎం సిద్దరామయ్య సందర్శకులను ఉద్దేశించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం మాట్లాడుతున్న వేళ ఒక్కసారిగా కొందరు బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అంతలోనే గమనించిన సీఎం 'ఏయ్.. ఎవరక్కడ..?' అన్నారు. కూర్చోండి అంటూ గదమాయించారు. ఒకసారి చెబితే మీకు అర్థం కాదా.. ఇంట్లోనే ఉండాల్సింది. అరగంట లేదా గంటసేపు కూర్చోనే ఓపిక లేకుంటే ఎందుకు వచ్చారన్నారు. పోలీసులు ఎవరినీ బయటకు వదలరాదన్నారు. సీఎం ఆగ్రహంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అయ్యాయి.


బానుముస్తాక్‌కు జ్ఞాపిక బహూకరణ


బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు

వైభవం.. శరన్నవరాత్రి ఉత్సవం

కులగణన ప్రారంభం

- బెంగళూరు మినహా రాష్ట్రవ్యాప్తంగా మొదలైన ప్రక్రియ • పలుచోట్ల ఉపాధ్యాయుల నిరసన

బెంగళూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కులగణన ప్రక్రియ ప్రారంభమైంది. ఓవైపు వారం రోజులుగా కులసంఘాలు తమ సామాజిక వర్గాలను చైతన్యం చేసుకునేందుకు వివిధ రీతులలో సభలు, సమావేశాలు జరిపారు. సోమవారం జిల్లాలవారీగా కులగణన ప్రక్రియ ప్రారంభమైంది. మండ్యలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చలువరాయస్వామి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఇదే సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ఉపాధ్యాయులు వస్తారని వారు అడిగే ప్రశ్నలకు వివరణ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కులగణనను ప్రారంభించినట్టు తెలిపారు. స్టేట్ రీసోర్స్ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ సమీక్షకు కుటుంబ పెద్ద పేరుతోపాటు ఇంటి చిరునామా, ఆధార్, రేషన్‌కార్డు వివరాలతోపాటు మతం, కులం, ఉపకులంతోపాటు విద్య, తదితర వివరాలను నమోదు చేయాలన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ గణిగ, ఎమ్మెల్సీ దినేశ్ గూళిగౌడ, జిల్లా అధికారి కుమార్, జడ్పీ సీఈఓ కేఆర్ నందిని, ఎస్పీ మల్లికార్జున బాలదండితోపాటు బీసీ కమిషన్ డిప్యూటి డైరెక్టర్ మంజుళలు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ కులగణన ప్రక్రియ ప్రారంభమైంది. ధారవాడ జిల్లా హునగుందలోని ఇలకల్ హైస్కూల్ వద్ద కులగణన ప్రక్రియలో పాల్గొనాల్సిన ఉపాధ్యాయులు శిక్షణా తరగతులను బహిష్కరించారు. ఆదివారం శిక్షణలు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. హెడ్మాస్టర్‌లను కులగణన ప్రక్రియకు దూరం ఉంచాలని డిమాండ్ చేశారు. హునగుంద తాలూకాలో 107, ఇలకల్ తాలూకాలో 72మంది ఉపాధ్యాయులను నియమించారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నచ్చచెప్పారు. కాగా బెంగళూరులో బీసీ కమిషన్ చైర్మన్ మధుసూదన్ నాయక మాట్లాడుతూ అన్ని ప్రాంతాలలోనూ కులగణన ప్రక్రియ ప్రారంభమైందన్నారు. శివమొగ్గలో కిట్‌లు తీసుకునేందుకు వచ్చిన ఉపాధ్యాయులు పలు సమస్యలు తెలిపారన్నారు. సాంకేతిక సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చిత్రదుర్గలో మంత్రి సుధాకర్ కులగణన ప్రక్రియను ప్రారంభించారు. కాగా ఇంటర్‌నెట్ సమగ్రంగా పనిచేయడం లేదని, మోడీ యాప్ కూడా ఓపెన్ కావడం లేదని మంత్రి మధుబంగారప్ప ఆరోపించారు. మరోవైపు కులగణనలో ఆత్రుత వద్దని గడువు ఇవ్వాలని కొన్నాళ్లపాటు వాయిదా వేయాలని కోరుతూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఒక్కలిగ, లింగాయత సామాజికవర్గాల ముఖ్యులు భేటీ అయ్యారు.


మండ్యలో కులగణనను ప్రారంభిస్తున్న మంత్రి చలువరాయస్వామి

కన్నబిడ్డను కాలువలో పడేసింది

- మూడో కాన్పులోనూ ఆడపిల్ల పుట్టిందనే..
- పాప కనబడలేదంటూ తనే ఫిర్యాదు
- పోలీసుల విచారణలో బయటపడిన నిజం


తల్లి ప్రియాంక, సీసీ టీవీ ఫుటేజీ, చిన్నారి మృతదేహం

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అమ్మ ప్రేమను చూపాల్సిన తల్లి అమానుషానికి ఒడిగట్టింది. అనురాగంగా పెంచాల్సిన చేత్తో అన్యాయంగా కాలవలో పడేసి కన్నప్రేమకు తావు లేకుండా చేసింది. మూడో కాన్పులో కూడా ఆడపిల్ల పుట్టిందనే కారణంతోనే కన్నతల్లే రెండు నెలల పసికూనను కాలువలో విసిరేసి హత్యకు పాల్పడిన ఘటన సండూరు తాలూకా పరిధిలోని తోరణగల్లులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ప్రియాంక దేవిఅనే మహిళ పాల్పడింది. ఆమె భర్త సరోజ్ కుమార్ జిందాల్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. బిహార్‌కు చెందిన ఈ దంపతులు తోరణగల్లులో నివాసం ఉంటున్నారు. ఇప్పటికే వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మూడో కాన్పులో కూడా ఆడపిల్ల పుట్టిందనే కారణంతో కన్నతల్లి ఆడశిశువును డ్రైనేజీ కాలువలో పడేసినట్లు పోలీసులు గుర్తించారు. చిన్నారిని పడేసిన తనే పాప కనిపించడం లేదంటూ తోరణగల్లు పోలీసు స్టేషన్‌లో ఏడ్చుకుంటూ ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తుండగా.. సీసీ టీవీ ఫుటేజీలో ప్రియాంకే.. చిన్నారిని ఎత్తుకెళుతూ డ్రైనేజీ కాలువలో పడేసినట్లు తేలడంతో ఆమె అసలు రూపం బయటపడింది. దీంతో ప్రియాంక దేవిపై తోరణగల్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

జీఎస్టీ పొదుపు ఉత్సవంపై బీజేపీ సంబరాలు


మండ్యలో మిఠాయిలు పంచుతున్న ప్రతిపక్ష నేత అశోక్


శివమొగ్గలో స్వీట్లు పంచుతున్న బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర

బెంగళూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం జీఎస్టీని సరళీకృతం చేస్తూ తీసుకువచ్చిన 2.0 విధానం సోమవారం నుంచి అమలులోకి రావడంతో రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. జీఎస్టీ పొదుపు ఉత్సవం పేరిట అన్ని జిల్లాల్లో ఉత్సాహంగా సంబరాలు జరిపారు. మండ్యలోని కామనగుడి సర్కిల్ పేటవీధిలో ప్రతిపక్షనేత అశోక్ పాల్గొన్నారు. మహిళలు, వ్యాపారులకు స్వీట్లు పంచారు. శివమొగ్గలో బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర స్వీట్లు పంచారు. కిత్తూరు రాణి చన్నమ్మ సర్కిల్‌లో వేడుకలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయంతో దేశమంతటా వ్యాపారులకు, వినియోగదారులకు అనుకూలమైందన్నారు. ప్రధాని నిత్యం పేదల మేలు కొరకే ఆలోచిస్తారని, అందరూ బాగుండాలన్నదే ఆయన లక్ష్యం అన్నారు. కాగా బెంగళూరు చిక్కపేట సర్కిల్‌లోని రాజా మార్కెట్ వద్ద ఎంపీ పీసీ మోహన్ వ్యాపారులకు స్వీట్లు పంచారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సప్తగిరిగౌడ తదితరులు పాల్గొన్నారు.

నవంబరులో 50శాతం మంది

మంత్రుల మార్పు



- చీఫ్ విప్ సలీం అహ్మద్

బెంగళూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నవంబరులో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని 50శాతంమంది మంత్రుల మార్పు ఉండనుందని విధానపరిషత్ చీఫ్‌విప్ సలీం అహ్మద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ మంత్రి పదవినుంచి బయటకు వచ్చేవారికి పార్టీకి సంబంధించిన పదవులు అప్పగిస్తామన్నారు. కొత్తవారికి కేబినెట్‌లో చోటు ఉంటుందన్నారు. కిత్తూరు కర్ణాటక పరిధి నుంచి మైనారిటీలలో మంత్రి పదవి ఎవరికీ దక్కలేదని, వచ్చే విస్తరణలో అవకాశం ఉంటుందన్నారు.

సోదాల పేరుతో దోచుకున్నారు

- ఐటీ అధికారులమంటూ దాడులు • కోటిన్నర హంఫట్

బెంగళూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని యలహంక ప్రాంతంలో ఐటీ అధికారుల తరహాలో ఓ ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు వంటగదిలో దాచి యున్న 1.5 కోట్ల రూపాయల నగదుతో పరారయ్యారు. నకిలీ నెంబరు ప్లేట్‌తో ఇన్నోవా కారులో వచ్చిన నలుగురు గిరిరాజ్ అనే వ్యక్తి ఇంటికి వెళ్లారు. ఐటీ అధికారులమని, ఇంటిని సోదా చేయాలన్నారు. ఇంట్లో అక్రమంగా నగదు దాచినట్లు అనుమానాలు ఉన్నాయన్నారు. ఇంటి యజమాని గిరిరాజ్ ఎక్కడ ఉన్నారని కుటుంబ సభ్యులను బెది రించారు. అంతలోనే వంటింట్లో దాచియున్న నగదు సంచిని గుర్తించి తీసుకున్నారు. ఈ డబ్బు ఎలా వచ్చిందంటూ ప్రశ్నించారు. కాసేపటికే నోటీసులు ఇస్తామంటూ బెదిరించారు. ఇంటినుంచి పరారయ్యారు. గిరిరాజ్ భూమి కొనుగోలు చేసేందుకు సిద్ధం చేసుకున్న కోటిన్నర మొత్తాన్ని ఇంట్లో పెట్టుకున్నాడు. ఈనెల 19న గిరిరాజ్ బయటకు వెళ్లిన వేళ ఇంట్లోకి ప్రవేశించి అందరి మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఇల్లు మొత్తం సోదాలు జరిపారు. వంటింట్లోని నగదుసంచితోపాటు 50 గ్రాముల బంగారు ఆభరణాలను లూటీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు యలహంక పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆక్సిజన్ కొరతతో రోగి మృతి

వైద్యాధికారి, స్టాఫ్‌నర్సుపై కేసు నమోదు

రాయచూరు సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజీవ్ గాంధీ మెమోరియల్ సూపర్ స్పెషాలిటీ ఒపెక్ ఆస్పత్రిలో ఆక్సిజన్ కొరతతో రోగి ఒకరు మృత్యువాత పడ్డారు. మూడేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న శ్రీనివాస్ అనే రోగి ఈనెల 18వ తేదీన ఒపెక్ ఆస్పత్రిలో చికిత్స కోసం చేరారు. అతనికి క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించిన వైద్యాధికారులు ఐసీయూలో ఉంచి ఆక్సిజన్ అందిస్తున్నారు. ఆక్సిజన్ ఖాళీ కాగా సకాలంలో ఆక్సిజన్‌ను ఏర్పాటు చేయడంతో స్టాఫ్ నర్సు, వార్డ్‌బాయ్ విఫలం అయ్యారని రోగి తండ్రి మురళీధర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు ఒపెక్ ఆస్పత్రి వైద్యాధికారితోపాటు స్టాఫ్‌నర్సు, వార్డ్‌బాయ్ పై సోమవారం కేసు నమోదు చేశారు.

గోకళం..!

● గోకులం షెడ్లతో మూగజీవాలకు రక్షణ ● తప్పిన విషసర్పాలు, క్రిమికీటకాల బెడద ● అభివృద్ధి చెందుతున్న పాడి



గోకులం షెడ్డులో ఉన్న పశువులు

శింగనమల, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్లు.. పాడి ఉత్పత్తికి తోడ్పడుతున్నాయి. మూగజీవాలకు రక్షణ కల్పిస్తున్నాయి. విష సర్పాలు, క్రిమికీటకాల బెడద తప్పింది. షెడ్లు అనువుగా ఉండడంతో రైతులు.. మరిన్ని పాడి పశువులు కొనుగోలు చేస్తున్నారు. అలా.. మండలంలోని సోదనపల్లి పంచాయతీలో పాడి పశువుల సంఖ్య పెరుగుతోంది. పాడి పరిశ్రమకు పూర్వ వైభగం తీసుకురావాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం గోకులం షెడ్లు మంజూరు చేసింది. సోదనపల్లి పంచాయతీకి మెదట 20 షెడ్లు మంజూరయ్యాయి. పంచాయతీలోని సోదనపల్లి, ఈస్టు నరసాపురంలో పాడి రైతులు నెలలోపే వాటి నిర్మాణాలు పూర్తి చేశారు. రెండో విడతలో మరో 10 గోకులం షెడ్లు రావడంతో రైతులు వాటిని పూర్తి చేశారు.

అర్హులందరికీ షెడ్లు మంజూరు చేస్తాం:

- సౌభాగ్య, ఏపీఓ, శింగనమల

మండలంలో అర్హత గల ప్రతి రైతుకు గోకులం షెడ్డు మంజూరు చేస్తాం. సోదనపల్లి పంచాయతీలో షెడ్లు నిర్మించుకోవడానికి రైతులు ముందుకొస్తున్నారు. ఇంకా దరఖాస్తులు చేసుకుంటున్నారు. అర్హులైన వారికి మంజూరు చేస్తాం.



సోదనపల్లిలో నిర్మించిన గోకులం షెడ్డు

వ్యాధుల నుంచి రక్ష



గోకులం షెడ్డులో ఉంచుతుండడంతో మూగజీవాలకు వ్యాధులు సోకట్లేదు. గతంలో పశువులు ఎక్కువ సంఖ్యలో ఉండేవి. రానురాను వాటి సంరక్షణ భారం కావడంతో విక్రయించాం. ప్రస్తుతం పాడి షెడ్డు అనువుగా ఉండడంతో ఉన్నవాటికి తోడు మరిన్ని పశువులు కొనుగోలు చేస్తున్నాం.

- రైతు లక్ష్మీనారాయణ

విషసర్పాల భయం లేదు



పశువులను రాత్రిళ్లు అరు బయట దొడ్లలో కట్టేయాలంటే భయంగా ఉండేది. పాము, క్రిమికీటకాలు, దోమకాటుతో పశువులు అనారోగ్యం బారినపడి, మృతిచెందేవి కూడా. గోకులం షెడ్డు నిర్మించుకోవడంతో ఆ ముప్పు తప్పింది. గోకులం షెడ్డు చాలా ఉపయోగకరం.

- రైతు వరప్రసాద్

పాడిపరిశ్రమ అభివృద్ధికి బాట



గ్రామాల్లో గతంలో పాడి పశువులు గణనీయంగా ఉం డేవి. కాలక్రమేణా పాడి పరిశ్రమ అంతరించిపోవడంతో పాలు, పెరుగు కూడా అంగట్లో కొనుగోలు చేశాం. ప్రస్తుతం గోకులం షెడ్డు కట్టుకోవడంతో మళ్లీ పశువులు కొనుగోలు చేసి, పెంచుతున్నాం. మళ్లీ పూర్వ వైభవం వస్తోంది.

- రైతు రమేష్

జేఎన్‌టీయూ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరచిన ఎన్‌సీసీ క్యాడెట్లతో వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య

అనంతపురంరూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేశరాజధాని న్యూఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా థల్ సైనిక్ క్యాంప్‌లో జేఎన్‌టీయూ ఎన్‌సీసీ విద్యార్థులు ప్రతిభచాటారు. కళాశాలకు చెందిన ప్రణతి, అఖిల, సౌజన్య, నఫియా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల డైరెక్టరేట్ తరఫున పాల్గొన్నారు. ఈనెల 1 నుంచి 12 వరకు సైనిక్ క్యాంప్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రణతి, సౌజన్యలు దూరం నిర్ణయించడం, ఫీల్డ్ సిగ్నల్స్ విభాగంలో పాల్గొన్నారు. అఖిల, నఫియా మ్యాప్ రీడింగ్ విభాగంలో ప్రతిభ చూపి ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా ఆరో స్థానం సాధించారు. వీరిని జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ శారద అభినందించారు.

సెలవుల్లో స్కూళ్లు నడిపితే చర్యలు

● డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురంవిద్య, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సెలవు రోజుల్లో పాఠశాలలు నడిపితే చర్యలు తప్పవని డీఈఓ ప్రసాద్‌బాబు సోమవారం ఓ పకటనలో హెచ్చరించారు. ఈనెల 22 నుంచి వచ్చేనెల అక్టోబరు 2 వరకు ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించినట్లు వెల్లడించారు. అయినా కొందరు ఇంకా పాఠశాలలు నడుపుతున్నారనే ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సెలవుల్లో స్కూళ్లను నడిపితే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సెలవులు వినియోగించుకునే ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు చూడాలని డీఈఓ సూచించారు.

వేప చెట్టును ఢీకొన్న ఐచర్

కోటపల్లి రైతు మృతి



నరేష్(ఫైల్)

తనకల్లు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దండువారిపల్లి సమీపంలో సోమవారం ఐచర్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తనకల్లు మండలం కోటపల్లి గ్రామానికి చెందిన నరేష్(34) మృతిచెందాడు. నరేష్ వ్యవసాయంతోపాటు ఐచర్ వాహనాన్ని ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందేవాడు. వేరే రైతు పండించిన టమోటాలను కర్ణాటకలోని కోలార్ మార్కెట్‌కు తరలించాడు. తిరిగి వస్తుండగా దండువారిపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనా న్ని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న వేప చెట్లును ఢీకొట్టాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఖాళీ కుర్చీలే డాక్టర్లు !

● వేళకు విధులకురాని వైద్యులు

● పెద్దాస్పత్రి, సూపర్ స్పెషాలిటీలో రోగుల అవస్థలు

● ఆస్పత్రి అంటే...చిన్న కథకాదు

ఆంధ్రజ్యోతి విజిట్



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న జీర్ణకోశ శస్త్రచికిత్స ఓపీ, డాక్టర్ కోసం నిరీక్షిస్తున్న రోగులు

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్లు డ్యూటీలకు డుమ్మా కొడుతున్నారు. వేళకు విధులకు రాకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులేమో కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ అని వెళ్లిపోయారు. ఇదే అదనుగా డాక్టర్లు, సి బ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యం లో వైద్యం కోసం ప్రభుత్వ సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇవీ సోమవారం 'ఆంధ్రజ్యోతి విజిట్'లో కనిపించిన కొన్ని దృశ్యాలు. అనారోగ్యంతో నగరంలోని ఈ రెండు ఆస్పత్రులకు వస్తే డాక్టర్లు, సిబ్బందితోపాటు వీల్‌చైర్లు, స్ట్రెచర్లు లేకపోవడంతో రోగులు, వారి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఓపిక ఉండాల్సిందే..

ప్రభుత్వ సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చే రోగులకు ఓపిక ఉండాల్సిందే. సుదూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసాల కోర్చి ఉదయమే ఆస్పతికి చేరుకుని, డాక్టర్ల కోసం నిరీక్షిస్తున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఓపీ విభాగంలో రెండు మూడు గదుల్లో డాక్టర్ల టేబుళ్లు, కుర్చీలు ఖాళీగా కనిపించాయి. మరికొన్ని ఓపీల్లో జూనియర్ డాక్టర్లు చూస్తున్నారు. సీనియర్ డాక్టర్లతో సమస్యలను చెప్పుకుందామంటే వారెప్పుడు వస్తారో, పోతారో తెలియని పరిస్థితులు ఉన్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల్లో వీల్‌చైర్, స్రెచర్‌ల కొరత ఉండటంతో ఒక్కోదానిపై ఇద్దరు, ముగ్గురు రోగులను తరలిస్తున్నారు. కొందరిని కుటుంబసభ్యులే భుజాలపై ఆయా విభాగాలకు చేరుస్తున్నారు.



సర్వజన వైద్యశాలలో ఆర్థోవిభాగం ఓపీలో ఖాళీగా ఉన్న కుర్చీ, రోగులకు సర్దిచెబుతున్న సిబ్బంది

జాగ్రత్తలు తీసుకుంటాం

- డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్

రోగులు ఇబ్బందిపడకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. సోమవారం ఓపీ సంఖ్య ఎక్కువగా ఉంటుంది. మూడువేల మందికిపైగా రోగులు వస్తున్నారు. వీరికి సరిపడా స్ట్రెచర్స్, వీల్‌చైర్స్‌ను అందుబాటులో ఉంచుతాం. డ్యూటీల్లోలేని డాక్టర్లపై చర్యలు తీసుకుంటాం. సిబ్బంది, సెక్యూరిటీని సమకూర్చుతాం. సోమవారం కావడంతో అడ్మినిస్ట్రేటర్‌తోపాటు నేనూ గ్రీవెన్స్‌కు వెళ్లాల్సి వస్తోంది.

మూట చెనిక్కాయలిస్తే ఓర్వలేదు..

అందుకే.. ఆస్తి కావాలి..!

గ్రీవెన్స్‌లో సోదరులపై అక్కాచెల్లెళ్ల ఫిర్యాదు



అనంతపురం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వీరిద్దరూ అక్కచెల్లెల్లు. పేర్లు.. సత్యమ్మ, భ్రమరాంబ. సమస్య ఏమిటని అధికారులు అడిగితే.. 'మేము అనంతపురంలో ఉంటున్నాం. మా అమ్మపేరు వెంకటమ్మ. తనకు ఐదుగురు కొడుకులు, ఇద్దరు బిడ్డలం. కొడుకులు చూసుకోవడం లేదని మా అమ్మ మా వద్దే ఉంటున్నారు. రాప్తాడు మండలం పాలచెర్లలో మా అమ్మకు పొలం ఉంది. ఆ భూముల కౌలు డబ్బులు, ప్రభుత్వ పథకాలు డబ్బులను మా సోదరులే తీసుకుంటున్నారు. అయినా మేము పట్టించుకోలేదు. మా అమ్మ వృద్ధాప్యంలో, కదలలేని స్థితిలో ఉన్నారు. అయినా వారికి దయ లేదు. ఇటీవల కౌలు రైతు మాకు ఒక మూట చెనిక్కాయలు ఇచ్చారు. ఆ విషయం తెలిసి మా సోదరులు రగిలిపోతున్నారు. మాకు ఆ మాత్రం కూడా ఇవ్వకూడదట. అందుకే మా అమ్మ భూమిలో మాకూ వాటా కావాలి. దయచేసి న్యాయం చేయండి..' అని విన్నవించారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కలెక్టరేట్

గ్రంథాలయాలను ఆధునికీకరించండి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి



పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సమస్యలను ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో సోమవారం ప్రస్తావించారు. ఆధునిక దేవాలయాలైన గ్రంథాలయాలను డిజిటలైజ్ చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు అత్యంత కీలకమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాల్లో పనిచేసే సిబ్బంది జీతాలకు తగినంత గ్రాంటు ఇవ్వడం లేదని అన్నారు. స్థానిక సంస్థల నుంచి వచ్చే పన్ను ఆదాయాన్ని గ్రంథాలయాల నిర్వహణకు కేటాయించాల్సి వస్తోందని, దీనివల్ల గ్రంథాలయాల అభివృద్ధి ఆగిపోతోందని అన్నారు. ఖాళీగా ఉన్న లైబ్రేరియన్, వాచ్‌మన్, రికార్డు అసిస్టెంటు పోస్టులను భర్తీ చేయాలని కోరారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రంథాలయాలను ఆధునికీకరించాలని ఎమ్మెల్యే కోరారు. యువతకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాల ధరలు మార్కెట్‌లో అధికంగా ఉన్నాయని, వీటి ధరలను ప్రభుత్వమే నిర్ణయిస్తే బాగుంటుందని అన్నారు. ఈ సమస్యలపై మంత్రి నారా లోకేశ్ బదులిచ్చారు. ఎమ్మెల్యే తెలియజేసిన సమస్యలపై అధికారులతో చర్చించి, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

ఆర్డీటీ మా జిల్లాలకు వరం

● ఆ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలి

● అసెంబ్లీలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంతపురం, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం ఉమ్మడి జిల్లాకు ఆర్డీటీ సంస్థ ఒక వరమని, అలాంటి సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేసి కాపాడాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో సోమవారం ఆమె మాట్లాడుతూ ఐదు దశాబ్దాలకుపైగా ఉమ్మడి అనంత జిల్లాలోనే కాకుండా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మొత్తం 152 మండలాలు, 4 వేల గ్రామాల్లో 5 లక్షల కుటుంబాలకు ఆర్డీటీ ద్వారా సేవలందుతున్నాయన్నారు. సుమారు 20 లక్షల మందికిపైగా ఈ సంస్థపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వైద్యం, విద్య, వ్యవసాయం, గృహ నిర్మాణాలు, క్రీడలపరంగా సంస్థ సేవలందిస్తోందన్నారు. ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయకపోవడం వల్ల కీలకమైన సేవలు ఆగిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. దీనిపై జిల్లా టీడీపీ నాయకులు, రాష్ట్ర ఎంపీల సహకారంతో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాని కలిసి విజ్ఞప్తి చేసినా కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. అందుకే అసెంబ్లీ సభ ద్వారా కేంద్రానికి ప్రతిపాదన పంపించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

రైతులను ఆదుకోండి

జిల్లాలో వర్షాధారంగానే ఏడు లక్షల హెక్టార్ల వరకూ పంటలు సాగవుతాయని, ప్రతి ఏటా అతివృష్టి లేదా అనావృష్టి మూలంగా జిల్లా రైతాంగం పంటలు నష్టపోతున్నట్లు సభలో పేర్కొన్నారు. ప్రతి ఏటా పంటలు వేయడమే తప్పా లాభం తీసుకున్న సందర్భాలే లేవన్నారు. కనీసం పెట్టుబడులు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో వర్షాలు సకాలంలో రాక పంటలు వేయలేకపో యారన్నారు. అరకొరగా విత్తనం వేసినా వర్షాలు లేక ఎండిపోయింద న్నారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ బీమా వ్యవస్థను నాశనం చేసిందని మండిపడ్డారు. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, కంది, ఆముదం పంటలు వేస్తున్నారని, ఇందుకు ప్రభుత్వం నుంచి సహకారం కావాలని కోరారు. మార్కెటింగ్ శాఖ ద్వారా టమోటా ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేలా సహకారం అందించాలని ఆమె ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఉల్లి రైతులకు హెక్టారుకు రూ. 50 వేలు ఇస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి పరిటాల సునీత ధన్యవాదాలు తెలిపారు.

ఆర్డీటీ సేవలు అత్యవసరం

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



శింగనమల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు ఆర్డీటీ సేవలు అత్యవసరమని, ఆ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేసి ఇబ్బందులు తీర్చాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. శాసనసభ సమావేశంలో సోమవారం ఆమె మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ ద్వారా లక్షల మంది పేద వర్గాలకు విద్య, వైద్యం సదుపాయంతో పాటు వ్యవసాయ రంగంలో సహకారం అందుతోందన్నారు. ఆర్డీటీ ద్వారా వేలాది మంది జీవనోపాధి పొందుతున్నట్లు వివరించారు. ఆర్డీటీని కాపాడే దిశగామంత్రి నారా లోకేశ్, రాష్ట్ర ఎంపీలు ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసి, సమస్యను వివరించినట్లు తెలిపారు. ఆర్డీటీకి శాశ్వత పరిష్కారం చూపేలా కేంద్రంతో రాష్ట్ర నాయకత్వం మాట్లాడుతోందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



పంట దిగుబడి బాగుండటంతో ఏటికేడు అరటి సాగు తాడిపత్రి ప్రాంతంలో పెరుగుతోంది. అయితే ధర నిలకడగా ఉండకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. నెల కిందట టన్ను 15వేల నుంచి రూ.20వేల వరకు ఉండేది. ప్రస్తుతం సగానికి పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోతే తెచ్చిన అప్పులు, వాటికి వడ్డీలు ఎలా కట్టేది అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-ఆంధ్రజ్యోతి, తాడిపత్రి



అరటికి రేటు ఏదీ..?

● భారీగా తగ్గిన ధర

● టన్ను రూ.7వేల నుంచి రూ.10వేలలోపే..

● ఆందోళనలో అన్నదాతలు

వేల హెక్టార్లలో సాగు

తాడిపత్రి ప్రాంతంలో దాదాపు 8 వేల హెక్టార్ల భూమిలో అరటి సాగవుతోంది. పుట్లూరు మండలంలో అత్యధికంగా అరటి సాగు చేస్తున్నారు. తాడిపత్రి మండలంలో 50హెక్టార్లు, పుట్లూరు మండలంలో 4500 హెక్టార్లు, యల్లనూరు మండలం 900హెక్టార్లు, యాడికి మండలం 800హెక్టార్లు, పెద్దపప్పూరు మండలం 1100హెక్టార్లలో అరటిసాగులో ఉంటోంది. ఈ ఏడాది అదనంగా మరికొన్ని హెక్టార్లు సాగులోకి రానుంది. ఎకరా అరటి సాగుకు దాదాపు రూ.లక్షకు పైగానే పెట్టుబడి అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అరటి మొక్క 9నెలల తర్వాత గెలలు వేయడం ప్రారంభం అవుతుంది. దిగుబడి, ధర బాగుంటే రైతుల కష్టాలు తీరుతాయి లేకుంటే పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు కుప్పలవుతాయి. కొన్ని సందర్భాల్లో ప్రకృతి వైపరీత్యాలు, గిట్టుబాటు ధర లేకపోవడం వంటి ఘటనలతో రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు కూడా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు.

టన్ను రూ.10వేలలోపే..

గతనెలలో అరటి ధర టన్ను రూ.20వేలకు పైగా పలకడంతో రైతులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. దీంతో అప్పులు చేసి మరింత భూమిలో అరటిపంట సాగు చేశారు. అయితే ప్రస్తుతం టన్ను అరటి ధర రూ.10వేల కంటే దిగువకు చేరింది. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా రాదని అరటి రైతు వాపోతున్నాడు. ఆగస్టు నెలలో టన్ను రూ.30వేల వరకు పలికింది. కానీ ఉన్నట్లుండి రూ.పదివేల కిందికి రావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

మహారాష్ట్ర ఎఫెక్ట్

మహారాష్ట్రలో ముందస్తుగా అరటి సాగు చేయడంతో ప్రస్తుతం పంట మార్కెట్‌లోకి వస్తోంది. వ్యాపారులు అక్కడ దొరికే పంటనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో తాడిపత్రి ప్రాంతానికి వర్తకుల తాకిడి లేకుండాపోయింది. అందుకే అరటి ధర తగ్గినట్లు రైతులు చెబుతున్నారు. సాధారణంగా తాడిపత్రి ప్రాంతం నుంచి ముంబై, చెన్నై, బెంగళూరు నగరాలకు అరటి పంటను ఎక్కువగా రవాణా చేస్తారు. ఇందులో కూడా మహారాష్ట్రదే సింహభాగం. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లోని మార్కెట్లకు కూడా రవాణా చేస్తారు. కానీ ఆయా రాష్ట్రాల్లో అరటి దిగుబడులు ఎక్కువగా రావడంతో ఏపీ వైపు వ్యాపారులు రావడం లేదని సమాచారం. ఇతర రాష్ట్రాల్లో మంచి దిగుబడితో పాటు వ్యాపారుల సిండికేట్ కూడా ధర పతనానికి కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. ఈక్రమంలో వ్యాపారులు, దళారీలు అడిగిన ధరకే పంటను విక్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు.

దళారుల వల్ల నష్టపోయా



ఈ ఏడాది పంట దిగుబడి బాగుందని సంతోషించేలోపే దళారులు సిండికేట్‌గా మారి ధరను తగ్గించేశారు. గత ఏడాది ధరలు ఉన్నప్పటికి ప్రకృతి వైపరీత్యానికి అరటి చెట్లు నేలకొరిగాయి. నెలరోజుల కిందటి వరకు ధరలు ఆశాజనకంగా ఉన్నప్పటికి పంట చేతికి వచ్చే సమయా నికి ధరలు కుప్పకూలాయి. ధర తగ్గినా పంటను ఆపలేము కనుక ఏదో ఒక రేటుకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

-పెద్దవీరనారప్ప, గడ్డం నాగయ్యపల్లి, నార్పల మండలం

అప్పులు తీర్చవచ్చు అనుకునేలోపే...



నేను ఏడు ఎకరాల్లో అరటిసాగు చేశా. దిగుబడి బాగుంది. అప్పులు తీర్చేయవచ్చని అనుకొనేలోపే ధరలు పడిపోయాయి. టన్ను రూ.7వేలు మాత్రమే ఉండటంతో సాగు కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. పంట చేతికి వచ్చే సమయానికి ధరలు పడిపోయాయి. ఇది ఇలాగే కొనసాగితే రైతులకు ఆత్మహత్యలు తప్ప వేరే మార్గం లేదు.

-గోవర్ధన్‌రాజు, కడవకల్లు, పుట్లూరు మండలం

టమోటా కిలో రూ.25

అనంతపురం రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.25తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠ ధర రూ.13, సరాసరి ధర రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,250 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిధరరూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 235టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

స్థానం నరసింహారావు (జయంతి)



సుప్రసిద్ధ రంగస్థల, తెలుగు సినిమా నటుడు స్థానం నరసింహారావు 1902 సెప్టెంబరు 23న గుంటూరు జిల్లా బాపట్లలో జన్మించారు. 1956లో పద్మశ్రీ పురస్కారం అందుకున్న తొలి ఆంధ్రుడు, కళాకారుడు. సత్యభామ, చిత్రాంగి తదితర స్త్రీ పాత్రలను 40 ఏళ్లకుపైగా ధరించి ప్రేక్షకుల అభిమానం పొందారు. తెనాలిలోని శ్రీరామవిలాససభ ద్వారా అప్పటి గొప్ప నటులందరి సరసన పాత్రలు ధరించి దేశమంతా పర్యటించారు. 3వేలసార్లు రంగస్థలంపై పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాల్లో స్త్రీ పాత్రలు ధరించారు. రంగూన్ ప్రజలు 1938లో బంగారు కిరీటాన్ని బహూకరించారు. నటస్థానం అనే గ్రంథాన్ని రచించారు. 1971 ఫిబ్రవరి 21న కన్నుమూశారు.

ఈమని శంకరశాస్త్రి (జయంతి)




ప్రముఖ వీణ విద్వాంసుడు ఈమని శంకరశాస్త్రి 1922 సెప్టెంబరు 23న కోనసీమ జిల్లా ద్రాక్షారామంలో జన్మించారు. తండ్రి, తాతలు కూడా వీణ విద్వాంసులే. తండ్రి వద్దనే వీణ వాదన నేర్చుకున్నారు. కాకినాడ పిఠాపురం కాలేజీలో డిగ్రీ పొందాక ఆయన వైణికుడిగా జీవితం ఆరంభించారు 1940లో తిరుచ్చి రేడియో కేంద్రంలో వీణ కచేరీ చేశాక పేరొందారు. తాను కీర్తనలను మాత్రమే కాకుండా వాయించకుండా లౌకిక ప్రపంచంతో కూడా తన సంగీతాన్ని అనుసంధానించారు. సినీ రంగంలోనూ రాణించారు. గమకాలు వేయడంలో, స్వరకంపనంలో, రాగాలాపనలో, తానం వేయటంలో ఇలా పలు విభాగాలలో కొత్త మార్గాలు సృష్టించారు. సంగీతంలో ఉన్న గమకాలకు తోడు మరో ఏడు రీతులను సృష్టించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు తదితర గౌరవాలు అందుకున్నారు. 1987 డిసెంబరు 23న కన్నుమూశారు.

నూర్‌జహాన్ (జయంతి)



నూర్ జహాన్ 1926 సెప్టెంబరు 23న జన్మించారు. ఆమెకు మాలిక్-ఎ- తరన్నుమ్ (ది క్వీన్ ఆఫ్ మెలోడీ) అనే గౌరవం ఉంది. పాకిస్థానీ గాయకురాలైన ఆమె ఆరు దశాబ్దాలపాటు పాటలతో అలరించి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. దేశంలో తొలి నేపథ్యగాయనిగా ప్రభావవంతులైన గాయనీమణులలో ఒకరు. ఉత్తమ నేపథ్యగాయకురాలిగా, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్, నేషనల్ అవార్డ్స్ తదితర 15కుపైగా అవార్డులు అందుకున్నారు. 2000 డిసెంబరు 23న కన్నుమూశారు.

కేబీ తిలక్ (వర్ధంతి)



స్వాతంత్ర్య సమరయోధుడు కొర్లిపర బాలగంగాధర తిలక్ 1926 జనవరి 14న జన్మించారు. ప్రజా నాట్య మండలిలోనూ కీలకంగా వ్యవహరించారు. మేనమామలు ఎల్వీ ప్రసాద్, అక్కినేని సంజీవిల ప్రోత్సాహంతో కొన్ని సినిమాలకు ఎడిటర్‌గా వ్యవహరించారు. మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు తెలుగుసినీ పరిశ్రమ తరలడంలో కృషి చేశారు. గాయని ఎస్ జానకి, నటి జయప్రదలను ఆయనే పరిచయం చేశారు. 2008లో బీఎన్ రెడ్డి నేషనల్ అవార్డు అందుకున్నారు. 2010 సెప్టెంబరు 23న కన్నుమూశారు.

స్వామి దయానంద సరస్వతి (వర్ధంతి)



స్వామి దయానంద సరస్వతి 1930 ఆగస్టు 15న తంజావూరు జిల్లాలో జన్మించారు. అద్వైత వేదాంత గురువుగా పేరొందారు. అర్ష విద్యా గురుకులం, ఆలిండియా మూవ్‌మెంట్ ఫర్ సేవా సంస్థాపకులు. ఐదు దశాబ్దాలపాటు అద్వైత వేదాంతాన్ని దేశవిదేశాలలో బోధించారు. దేశవ్యాప్తంగా పలు విద్యాసంస్థలకు నాంది పలికారు. ప్రజలలో సేవాభావాన్ని పెంపొందించారు. ఐక్యరాజ్య సమితి 50వ వార్షికోత్సవంలోనూ, మిలీనియం వరల్డ్‌పీస్ సమ్మిట్ తదితర సమ్మేళనాలలో ప్రసంగించారు. 2015 సెప్టెంబరు 23న కన్నుమూశారు.

అంబటి రాయుడు (పుట్టినరోజు)



ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు 1985 సెప్టెంబరు 23న గుంటూరులో జన్మించారు. 16వ ఏటనే క్రికెట్‌లోకి అడుగుపెట్టి తనదైన గుర్తింపు పొందారు. అండర్-19 క్రికెట్ జట్టుకు కేప్టెన్‌గా వ్యవహరించారు.



ఉత్సవాలకు విచ్చేస్తున్న యువరాజు



గౌరవ వందనం స్వీకరిస్తున్న యువరాజు యదువీర్



కుస్తీ పోటీని వీక్షిస్తున్న సీఎం

రాచరిక సంప్రదాయాలతో ప్యాలెస్‌లో దసరా



(5వపేజీ తరువాయి) ప్యాలెస్‌లో చాముండేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అప్పటికే సిద్ధం చేసిన విడిభాగాలతో బంగారు వజ్రఖచిత సింహాసనాన్ని రూపొందించారు. యువరాజు కంకణధారుడై నవరాత్రి పూజలు చేస్తారు. ఆ తర్వాత సింహాసనంపై అధిరోహించారు. యువరాజు సతీమణి త్రిషికా కుమారి పాదపూజ చేసి పుష్పార్చన చేశారు.. యువరాజు కుమారుడు తండ్రి బంగారుసింహాసనంపై ఆశీనులైనప్పుడు పూలుచల్లి గౌరవించి ఆశీస్సులు పొందారు. ఈ ప్రక్రియ 400 సంవత్సరాలకుపైగా వస్తోంది. ఈ ప్రక్రియ కొనసాగేంత వరకు రాజమాత ప్రమోదాదేవి ఒడయార్ పక్కనే ఆశీనులై ఉన్నారు. కాగా యువరాజు యదువీర్ సింహాసనం నుంచి ప్రైవేట్ దర్బార్ నిర్వహించారు.

హారతి స్వీకరిస్తున్న బానుముస్తాక్



ఉత్సవాల్లో తాళం వేస్తున్న సీఎం

కులగణనలో బ్రాహ్మణగా నమోదు చేయండి

» తాలూకా బ్రాహ్మణ మహాసభ పిలుపు



తాలూకా బ్రాహ్మణమహాసభ అధ్యక్షుడు ఏఎస్ రవి తదితరులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేలో ఉపకులాలు అవసరం లేదని కేవలం బ్రాహ్మణగా నమోదు చేయాలని తాలూకా బ్రాహ్మణ మహాసభ పిలుపునిచ్చింది. సోమవారం మహాసభ అధ్యక్షుడు ఏఎస్ రవి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చేపట్టిన కుల సమీక్షలో కొంత గందరగోళం ఉందని అభిప్రాయపడ్డారు. కులగణన సమీక్షలో బ్రాహ్మణ సముదాయానికి సంబంధించి అనేక ఉపకులాలు ఉన్నాయని క్రిస్టియన్ బ్రాహ్మణ, ముస్లిం బ్రాహ్మణ, ఒక్కలిగ బ్రాహ్మణ, కురుబ బ్రాహ్మణ వంటి కొత్త పేర్లు రాయడం సరికాదన్నారు. సముదాయ ఆత్మగౌరవానికి భంగంగా ఉంటుందన్నారు. కావున ప్రభుత్వం కులగణనలో ఈ లోటుపాట్లను సవరించాలని కోరారు. కులగణనలో 218 కాలంలో బ్రాహ్మణ అని నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీ నాగరాజరావ్, తాలూకా బ్రాహ్మణ మహాసభ బీఆర్ నటరాజ్, రాష్ట్ర కార్యవర్గ సమితి సభ్యుడు ఎన్ శ్రీకాంత్, చిక్కబళ్లాపుర జిల్లా అర్చకులు, పౌరోహితుల సంఘం అధ్యక్షుడు వీఎస్ రామమోహనశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో...

బాగేపల్లి: రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సామాజిక, విద్య (కులగణన) సమీక్ష వేళ బ్రాహ్మణ సామాజికవర్గం కులం కాలంలో బ్రాహ్మణ అని మాత్రమే నమోదు చేయాలని బాగేపల్లి తాలూకా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎస్ మునిరామయ్య పిలుపునిచ్చారు. సోమవారం సంఘం పదాధికారులతో కలసి మీడియాతో మాట్లాడుతూ కులగణనలో బ్రాహ్మణ సామాజికవర్గం ఎలాంటి ఉపకులం నమోదు చేయరాదన్నారు. మతం కాలంలో హిందువుగా నమోదు చేయాలని ఎలాంటి గందరగోళానికి లోను కావద్దన్నారు. సర్వేలో ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలని, 65కుపైగా ఉపకులాలు ఉన్నాయన్నారు. అయితే సమీక్షలో ఉపకులం నమోదు చేయరాదన్నారు. బ్రాహ్మణ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ రఘునాథ్ నేతృత్వంలో బ్రాహ్మణ సామాజికవర్గ అభివృద్ధికి 100 కోట్లతో ఫండ్ ఏర్పాటుకు సిద్ధమయ్యారని, ప్రతిభా పురస్కారాలు, స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారన్నారు. బ్రాహ్మణ సామాజికవర్గీయులు తప్పనిసరిగా సంఘంలో పేర్లు నమోదు చేసుకుని ప్రభుత్వ సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీడియా సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు హనుమేశ్, ప్రధాన కార్యదర్శి ఎన్ నాగరాజు, కోశాధికారి ఎస్ వేణు పాల్గొన్నారు.



బాగేపల్లి తాలూకా బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు మునిరామయ్య తదితరులు

ఉలేమా సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాతలను సన్మానిస్తున్న దృశ్యం

బాగేపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జమియత్ ఉలేమా కర్ణాటక, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తాలూకాశాఖ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థల సభ్యులు, వివిధ కన్నడ, దళిత, ప్రగతిపర సంఘాల సభ్యులు పాల్గొని రక్తదానం చేశారు. సర్కిల్ ఇన్ స్పెక్టర్ ప్రశాంత్ వర్ధి రక్తపరీక్ష చేయించుకోవడం ద్వారా శిబిరాన్ని ప్రారంభించారు. సీఐ మాట్లా డుతూ రక్తదానం చేసేందుకు కులమతాలకు అతీ తంగా ఎవరైనా చేయవచ్చునన్నారు. 18-60ఏళ్ల వారు రక్తదానం చేసే అవకాశం ఉందన్నారు. రక్తదానం ద్వారా మరొకరి ప్రాణం కాపాడినట్టు అవుతుందన్నారు. రెడ్‌క్రాస్ సంస్థ తాలూకా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉందని, భూగర్భజలాలు అడుగంటిన తాలూకాలోని యువతీయువకులలో రక్తం కొరత ఉందన్నారు. రక్తహీనత వల్ల పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. తాలూకాలో రక్తదాన శిబిరాలు మరింత పెరగాల్సి ఉందన్నారు. శిబిరంలో రక్తదాతలను సత్కరించారు. పురసభ ముఖ్యాధికారి ఎం శ్రీనివాస్, ప్రభుత్వ ఆసుపత్రి పాలనాధికారి డాక్టర్ వినయ్, డాక్టర్ యతీంద్ర, ఉలేమా సంఘం తాలూకా అధ్యక్షుడు రిజ్వాన్, కార్యదర్శి రియాజుద్దీన్, కరవే అధ్యక్షుడు బిటిసి శీనా తదితరులు పాల్గొన్నారు.

భార్యపై అనుమానంతో... కుమార్తె ఎదురుగానే దారుణహత్య

బెంగళూరు, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో కుమార్తె ఎదురుగానే భర్త దారుణంగా హత్య చేసిన సంఘటన బెంగళూరు సుంకదకట్టె వద్ద చోటు చేసుకుంది. సోమవారం ఉదయం 10.30 గంటలవేళ బస్టాండ్‌లో వేచియున్న రేఖా (35)ను భర్త లోకేశ్ ఒక్కసారిగా చాకుతో ఇష్టానుసారం పొడిచి పరారయ్యాడు. స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించగా చికిత్సలు ఫలించక కన్నుమూసింది. తుమకూరు జిల్లా శిరాకు చెందిన రేఖా నాలుగు నెలలక్రితం సుంకదకట్టెకు వచ్చారు. లోకేశ్‌తో పరిచయం కాస్త దగ్గర చేసింది. లోకేశ్‌కు ఆమె పనిచేసిన చోటునే డ్రైవర్ ఉద్యోగం ఇప్పించారు. రేఖా ఇటీవల కొన్నిరోజులుగా మరో వ్యక్తితో సన్నిహితంగా ఉన్నారనే విషయాన్ని లోకేశ్ జీర్ణించుకోలేకపోయాడు. బస్టాండ్‌లో ఇదే విషయమై ఇద్దరూ గొడవపడ్డారు. తొలుత చాకుతో రెండుసార్లు పొడిచాడు. తర్వాత కాస్తదూరం వెళ్లగా ఆ వెంటనే చాకుతో 11సార్లు ఇష్టం వచ్చినట్టు పొడిచాడు. దీంతో తీవ్రరక్తస్రావమై ఆమె కుప్పకూలిపోగా లోకేశ్ పరారీ అయ్యాడు. రేఖాకు ఇప్పటికే పెళ్లి కాగా మొదటిభర్తకు విడాకులు ఇచ్చారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మొదటి కుమార్తెకు 12ఏళ్లు. ఇటీవలే లోకేశ్‌తో రేఖా రెండో వివాహం చేసుకున్నట్టు పోలీసులు గుర్తించారు. లోకేశ్ కూడా పెళ్లై విడాకులు ఇచ్చాడు. ఇద్దరి మధ్య సుదీర్ఘకాలంగా ఉన్న స్నేహం పెళ్లికి దారితీయగా నాలుగు నెలలక్రితమే బెంగళూరుకు వచ్చారు. లోకేశ్ దాడి చేసినప్పుడు రేఖాతోపాటు 12ఏళ్ల కుమార్తె అక్కడే ఉన్నారు. కామాక్షిపాళ్య పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న లోకేశ్ కోసం గాలింపుల కోసం సిద్ధమయ్యారు. స్థానికంగా ఈ ఘటన కలకలం సృష్టించింది.



రేఖ (ఫైల్)

పండిట్ వెంకటేశ్ కుమార్‌కు సత్కారం సముచితం

» సీఎం సిద్దరామయ్య



పండిట్ వెంకటేశ్‌కుమార్‌కు సంగీత విద్వాన్ పురస్కారంతో సన్మానం

బెంగళూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): హిందూస్తానీ సంగీత విద్వాన్ పండిట్ వెంకటేశ్‌కుమార్‌కు సత్కారం చేయడం అంటే మనల్ని మనమే గౌరవించుకున్నట్టు అని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. పండిట్ వెంకటేశ్‌కుమార్‌కు దసరా ఉత్సవాల వేదికపైనే సంగీత విద్వాన్ పుర స్కారాన్ని సోమవారం ప్రదానం చేశారు. దసరా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించిన వేళ సీఎం మాట్లాడుతూ దసరా వేళ సంగీత విద్వాన్ పురస్కారం ఏటా ఒకరికి ఇచ్చే సంప్రదాయం ఉందన్నారు. విద్వాంసులు పుట్టరాజ్ గవాయ్ శిష్యరికంలో ఎదిగిన పండిట్ వెంకటేశ్‌కుమార్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారన్నారు. మంత్రి శివరాజ్ తంగడిగతోపాటు పలువురు పాల్గొన్నారు. పురస్కారంతోపాటు రూ.5లక్షల చెక్కును ప్రదానం చేశారు.

బీఈఎంఎల్ క్వార్టర్స్‌లో బతుకమ్మ



బతుకమ్మ వేడుక

కేజీఎఫ్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా వేడుకలలో భాగంగా బీఈఎంఎల్ క్వార్టర్స్‌లో బీఈఎంఎల్ తెలుగా కళా సమితికి చెందిన మహిళలు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. స్థానికంగా ఉండే 30కుపైగా కుటుంబాల వారు పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా ఉన్న విషయం విదితమే. కోలాటం వేసి సరదాగా గడిపారు.

కళాకారులను ప్రోత్సహిస్తాం



కళాకారుడు రేణుకారాధ్యకు సన్మానం

దొమ్మసంద్ర, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కళా కారులను తమవంతుగా ప్రోత్సహిస్తామని కేపీసీసీ ఉపాధ్యాయ విభాగం ఉపాధ్యక్షుడు విజయకుమార్ గౌడ అభిప్రాయపడ్డారు. చందన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆయనను మైసూరు తల. పాగాతో సత్కరించారు. పౌరాణిక నాటకాలలో శ్రీకృష్ణుడు, భీముడు, దుర్యోధనుడు, ధర్మరాజు, శకుని తదితర పాత్రలను పోషించిన చందన సేవా ట్రస్టు కోశాధికారి రేణుకారాధ్యను కళాబృందం తరపున అభినందించారు. ఈ సందర్భంగా కుపేంద్రగౌడ, మాదేశ్‌గౌడ, మల్లికార్జున్ ఆరాధ్య, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో దసరా వైభవం..!



విద్యారణ్యపుర కాళికా దుర్గా పరమేశ్వరికి బాలింత అలంకరణ



గిరినగర్ వాసవీమాతకు లక్ష్మీనారాయణ అలంకరణ



దొడ్డజాల ముత్యాలమ్మ దేవికి పసుపు, కుంకుమ అలంకరణ



చంద్రా లేఅవుట్ సెయింట్ ఫ్లవర్స్ పాఠశాలలో దసరా వేడుకల్లో టీచర్లు తదితరులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	10.610	10,735
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,303	10,135
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77

బూట్ల పంపిణీలో అవకతవకలపై విచారణకు

ప్రత్యేక కమిటీ

● జడ్పీ సీఈఓ మహమ్మద్ హారీస్



బళ్లారి సిటీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరిచి నాలుగు నెలలు అవుతున్నప్పటికీ కొన్ని చోట్ల బూట్లు, సాక్స్ పంపిణీ చేయకపోవడంపై ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై దర్యాప్తు చేయడానికి జిల్లాలో మెటీరియల్ ఆడిట్ ఏర్పడిందని, లోటుపాట్లను క్షుణ్ణంగా కమిటీ పరిశీలిస్తుందని జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హ్యారీస్ అన్నారు. రాష్ట్రంలో 1-10 తరగతులు చదువుతున్న మొత్తం 40,74 లక్షల మంది విద్యార్థులకు విద్యావికాస్ యోజన కింద ఒక జత బూట్లు రెండు జతల సాక్స్ పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21న మొత్తం రూ.410కోట్ల గ్రాంట్‌ను అందిస్తూ ఉత్తర్వు జారీ చేశారు. స్థానికంగా మంచి నాణ్యమైన పాదరక్షలను కొనుగోలు చేయడం పంపిణీ చేయడం వంటి బాధ్యతలకు సంబంధించిన పాఠశాలలోని పాఠశాల అభివృద్ధి పర్యవేక్షణ కమిటీ(ఎస్‌డీఎంసీ)కి అప్పగించారు. జిల్లాత సహా రాష్ట్రంలోని అనేక పాఠశాలల్లో ఇంకా పిల్లలకు బూట్లు, సాక్స్ పంపిణీ చేయలేదు. కొన్ని చోట్ల గ్రాంట్ రాలేదని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల ఎవరి నుంచి బూట్లు , సాక్స్ కొనాలనే ప్రశ్న తలెత్తుతోంది. రాజకీయ నాయకుల మద్దతుదారులు కొంతమంది బ్రోకర్లు కమిషన్లతో వారిని ఆకర్షించి లాభం పొందుతున్నారు. దీని కారణంగా బూట్ల పంపిణీ ఆలస్యం అవుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీఈఓ సూచనల మేరకు విద్యాశాఖ సంబంధిత తాలూకా కార్యనిర్వాహక అధికారులు(చైర్మన్) ఫీల్డ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు(వైస్ చైర్మన్) తాలూకా ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్స్‌పెక్టర్లు, విద్యాస మన్వయకర్తలతో కూడిని కమిటీ ఏర్పాటు చేసింది.

సాహితీవేత్త దేవేంద్రప్ప మృతి

రాయచూరు సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త, రిటైర్డ్ నగరసభ కమిషనర్ బుద్ధఘోష్ దేవేంద్రప్ప హెగ్డె(63) మృతి చెందారు. 2020లో నిర్వహించిన దేవదుర్గ కన్నడ సాహిత్య సమ్మేళనం కమిటీ అధ్యక్షుడిగా వ్యవహరించిన దేవేంద్రప్ప, సాహితీ రంగంలో తనదైన ముద్రను వేశారు. అంతకు పూర్వం ఉద్యోగిగా సేవలందిస్తునే దళిత సంఘర్ష సమితి ఏర్పాటులోను ఆయన విశేష కృషి చేశారు. బౌద్ధ ధర్మం పట్ల ఆకర్షితుడైన ఆయన బౌద్ధ ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తునే అట్టడుగు వర్గాలను ఏకం చేశారు.



అలంకరణలో చిన్నదుర్గమ్మ



వాసవీమాత



తాయమ్మ దేవి



పార్వతీదేవి



కాళికామాత

వైభవం..శరన్నవరాత్రి ఉత్సవం

బళ్లారి సిటీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవ రాత్రి మొదటి రోజు నగరంలోని అమ్మవారు పలు ఆలయాల్లో వివిధరూపాల్లో దర్శనం ఇచ్చింది. నగరంలోని పటేల్‌నగర్ చిన్నదుర్గమ్మ ఆలయంలో బాలాత్రిపురసుందరీదేవి అలంకారం, హంబావిలోని సిరుగుప్ప రోడ్డు సీతారామ ఆశ్రమంలో బాలాత్రిపుర సుందరీదేవి అలంకారం. బెంగళూరురోడ్డులోని వాసవి కళ్యాణ మంటపంలో వాసవీ దేవికి విశేష అలంకారంలో దర్శనమిచ్చింది. శరన్నవ రాత్రుల్లో మొదటి రోజు కావడంతో భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

సిరుగుప్ప (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రులు పురస్కరించుకుని తాయమ్మదేవిని బాలాత్రిపురదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. అర్చకులు శ్రీనివాస, ప్రవీణ్‌లు దేవికి ప్రత్యేక పూజలు జరిపారు.

కంప్లి (ఆంధ్రజ్యోతి): నవరాత్రుల సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణతో పూజలు చేపట్టారు. మొదటి రోజున బాలాత్రిపురసుందరి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. హంపిలో పార్వతిదేవికి ప్రత్యేకాలంకరణ చేపట్టి పూజలు నిర్వహించారు. కంప్లి షుగర్ ఫ్యాక్టరీలోనే కాళికాదేవి అమ్మవారికి నిమ్మకాయలతోను, తమలపాకులతోను ముస్తాబు చేపట్టి ప్రత్యేక పూజలు జరిపారు. పేట బసవేశ్వరాలయంలో తొమ్మిది రోజులుగాను తొమ్మిది రోజుల పాటు వివిధ ప్రధానమైన దేవుళ్ల రూపాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు జరపనున్నారు. మొదటి రోజు సందర్భంగా ఇడుగంజి గణేష స్వామివారిని ఏర్పాటు చేసి పూజలు జరిపారు.

బళ్లారిరూరల్ (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో విద్యానగర్ ఆంజనేయస్వామి ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణతో , ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు బోయపాటి విష్ణువర్ధన్ తెలిపారు.



ప్రత్యేకాలంకరణలో బాలాత్రిపుర సుందరీదేవి

పిల్లల హక్కుల రక్షణ.. ప్రభుత్వ బాధ్యత

● బాల్యవివాహాలతో అమ్మాయి ప్రాణాలకు ప్రమాదం ● సీనియర్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతి చిన్నారి చట్టపరమైన హక్కుల రక్షణ ప్రభుత్వం బాధ్యత అని, అధీన అధికారులు, గ్రామ పంచాయతీ, తాలూకా పంచాయతీ స్థాయి అధ్యక్షులతో పాటుప్రతి ఒక్కరూ పిల్లల హక్కుల రక్షణ పట్ల బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని బళ్లారి జిల్లా పంచాయతీ ముఖ్య కార్యదర్శి మహ్మద్ హ్యారీస్ సుమైర్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని జిల్లా పంచాయతీ నజీర్‌సభాంగణంలో రాష్ట్ర పిల్లల హక్కుల రక్షణ కమిషన్, పిల్లలరక్షణా డైరెక్టొరేట్ కార్యాలయం, జిల్లాపాలనా మండలి, జిల్లా పంచాయతీ, జిల్లా చట్టసేవే ప్రాధికార, మహిళా శిశు అభివృద్ధి శాఖ, జిల్లా పిల్లల రక్షణ విభాగం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులు, గ్రామ పంచాయతీ మహిళా అధ్యక్షులు, జిల్లా తాలూకా స్థాయి అధికారులకు మహిళల పిల్లల రక్షణ కావలి సమితి గురించి ఏర్పాటు చేసిన ఒక రోజు సెమినార్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అధికారులు ఆడపిల్లలను రక్షించే నేపథ్యంలో ఫోక్సో, బాల్య వివాహ, బాల గర్భిణుల్లాంటి కేసులు పరిణామకారణంగా అరికట్టడానికి పంచాయతీ సాయిలో నిఘా సమితి ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిఘా సమితిని ఉత్తేజం చేస్తే బాల్య వివాహ, ఫోక్సో లాంటి కేసులు సులభంగా అరికట్టవచ్చన్నారు. బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలన్న చట్టం ఉందని, కొన్ని కారణాల చేత బాల్యవివాహాలకు లోనవుతున్నారని, వాటిని అరికట్టాలన్నారు. అనంతరం చట్టసేవ ప్రాధికార మెంబర్ సెక్రరీ, సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేష్ ఎన్. హొసమనె మాట్లాడుతూ, పెరుగుతున్న చిన్నారికి సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అందరిదీ అని, చుట్టు ప్రక్కల బాల్య వివాహాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటే సహాయవాణి 1098 కానీ, పోలీసు సహాయ వాణి 112, లేదా ఉచిత చట్టసేవా ప్రాధికర సహాయవాణి 15100కు ఫోన్ చేసి వివరాలు అందజేయవచ్చని తెలిపారు. చిన్నవయస్సులో ఆడపిల్లలు గర్భం దాలిస్తే మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు తప్పవన్నారు. పుట్టిన బిడ్డ కూడా అనారోగ్యంతో జన్మించే అవకాశం ఉందన్నారు. అనంతరం జిల్లా పిల్లల రక్షణాధికారి సుభద్రా దేవి మాట్లాడుతూ జిల్లాలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 83 బాల్యవివాలు జరిగాయని, అందులో 64 బాల్య వివాహాలను అడ్డుకున్నామని, 19కేసులు బాల్యవివాహ కేసులు ఫోక్సో పరిధిలోకి వస్తాయన్నారు. 9 కేసులు ఎఫ్ఐఆర్ నమోదు కాగా, మరో 10 కేసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉందని వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నవీన్‌కుమార్, జిల్లా పంచాయతీ ఉప కారయదర్శి శశికాంత శివపూరె, మహిళా శిశు అభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ నాయక్, పిల్లల సంక్షేమ సమితి సభ్యులు కళావతి, వివిధ గ్రామ పంచాయితీ మహిళా అధ్యక్షులు, తాలూకా పంచాయతీ ఇఓ, గ్రామ పంచాయితీ పీడీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి రాజేశ్ హొసమనె



సర్వేను ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగేంద్రప్రసాద్, మేయర్ ముల్లంగి నందీశ్

సర్వేకు సహకరించాలి: కలెక్టర్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, విద్యా పరిస్థితులపై రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చేపట్టిన సర్వేకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ కోరారు. సోమవారం బళ్లారి నగరంలోని గుగ్గరహట్టిలోని వెంకటమ్మ కాలనీలో సర్వేను ప్రారంభించిన ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదేశాల మేరకు రాష్ట్రంలో సామాజిక, విద్యాభివృద్ధి కోసం సర్వే చేపడ్తున్నామన్నారు. ఈ సర్వే అక్టోబర్ 7వరకు నిర్వహించబడుతుందని, దీనికి అన్ని సన్నాహాలు చేయబడ్డాయన్నారు. 60 ప్రశ్నలతో కూడిన యాప్ ద్వారా సర్వే నిర్వహించడుతుందని, ప్రజలు దీనికి సహకరించాలన్నారు. సర్వే పని కోసం శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు వారి దిగువ స్థాయి ఎన్యూమరేటర్లు ,"సూపర్‌వైజర్లకు మార్గనిర్దేశం చేస్తారన్నారు. ప్రతి 108 ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్‌ను, ప్రతి 20 ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమిస్తున్నామన్నారు. సర్వేనుంచి ఏ కుటుంబం కూడా బయటపడకుండా జాగ్రత్తగా పని చేయాలని వారికి సూచించారు. ఈ సందర్భగా మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ ముల్లంగి నందీశ్, జిల్లాపంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ హారీస్, మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ మంజునాథ్, జిల్లావెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జలాలప్ప సహా సర్వేయర్లు, ప్రజలు పాల్గొన్నారు.

పథకాలతో గ్రామీణుల జీవితాల్లో మార్పు

● గ్యారెంటీల అమలు అథారిటీ చైర్మన్ చిదానందప్ప



మాట్లాడుతున్న చిదానందప్ప

బళ్లారి సిటీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలు చేయబడిన ఐదు హామీ పథకాలు గ్రామీణ ప్రజల జీవితాలను శక్తివంతం చేశాయని బళ్లారి జిల్లా హామీ పథకాల అమలు అథారిటీ చైర్మన్ చిదానందప్ప అన్నారు. బళ్లారి తాలూకాలోని సంగనకల్లు గ్రామ పంచాయతీలో సోమవారం జిల్లాపంచాయతీ, తాలూకా పరిపాలన , సంగనకల్లు గ్రామ పంచాయతీల సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐదు హామీ పథకాల పురోగతి సమీక్షా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హామీ పథకాలను సామాన్య ప్రజలకు సమర్థవంతంగా అందించాలనేది గొప్ప కోరిక అని, వారి ఆదేశాల మేరకు ఐదు హామీ పథకాలను అందించడంలో ఉన్న లోపాలను, ఈ పథకాల నుంచి తొలగించబడిన లబ్దిదారులను చర్చించడానికి ప్రతి గ్రామంలోని గ్రామ పంచాయితీ స్థాయిలో గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హామీ పథకాలను దాదాపు రూ.51,000 కోట్లు ఖర్చు చేసినప్పటికీ, అభివృద్ధి ప్రాజెక్టులకు నిధుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. హామీ పథకం అమలు కమిటీ చైర్మన్ గోనాల్ నాగభూషన్ గౌడ మాట్లాడుతూ బళ్లారి తాలూకాలో శక్తి యోజన కింద రూ.112.17 కోట్లు అన్నభాగ్య యోజన కింద రూ. 125.60 కోట్లు ,గృహలక్ష్మి యోజన కింద రూ.481,33 కోట్లు, గృహజ్యోతివ యోజన కింద రూ. 175. 5కోట్లు యువనిధి యోజన కింద రూ. 7.23కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. గ్రాంట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈసందర్భంగా శ్రీధర్, హామీ పథకం అమలు సంస్థ ఉపాధ్యక్షుడు విజయకుమార్, గ్రామపంచాయితీ అధ్యక్షురాలు గోవిందమ్మనాగిరెడ్డి, మారెక్క హనుమంతప్ప, జీవనోపాధి విభాగంవ వెంకటేశ్, రవాణాశాఖ బసవరాజ్, మహిళా శిశు అభివృద్ధి శాఖ మోహన్‌కుమార్, ఆదిలక్ష్మి, లక్ష్మీపతి, అల్లం ప్రశాంత్‌తో పాటు గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆ కులాలను ఎస్సీల్లో చేర్చరాదు

● రాష్ట్ర సఫాయి కర్మచారి మాజీ చైర్మన్ హనుమంతప్ప



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతప్ప

బళ్లారి సిటీ, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): అధికారికంగా తొలగించిన కులాలన్నింటినీ షెడ్యూల్డ్ కులాల్లో చేర్చడం ఆందోళనకరమైన పరిణామం అని కర్ణాటక రాష్ట్ర సఫాయి కర్మచారి అభివృద్ధి కార్పోరేషన్ మాజీ చైర్మన్ హనుమంతప్ప మండిపడ్డారు. నగరంలో కర్ణాటక మాదిగ, ఉపకుల సంస్థల సమాఖ్య సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే యాప్ నుంచి కులాల క్రైస్తవ ట్యాగ్‌ను తొలగిస్తూ కమిషన్ వెంటనే అధికారిక ప్రకటన విడుదల చేయాలన్నారు. ప్రతి మతం ముందు క్రైస్తవ చేర్చడం తగదన్నారు. ఈవిషయంలో అత్యంత బాధ్యతాయుతమైన సంస్థ అయిన వెనుకబడిన తరగతుల కమిషన్ 33 క్రైస్తవ కులాల స్థితిగతులపై స్పష్టత ఇచ్చిందని మిగిలిన 13దళిత క్రైస్తవ కులా స్థితిగులను స్పష్టం చేయలేదన్నారు. సర్వే కోసం తయారు చేసిన షెడ్యూల్డ్ కులాల జాబితా నుంచి ప్రభుత్వం వెంటనే ఎస్సీ క్రైస్తవ కులాలను తొలగించాలని ఆయన హెచ్చరించారు. సమావేశంలో బహుజన అంబేడ్కర్ సేన అధ్యక్షుడు నరసింహబాబు, సోమశేఖర్, ఈశ్వరప్ప, శివశంకర్, నరసప్ప, చౌదరి శ్రీనివాసులు, రాజేశ్, తిమ్మప్ప, తిప్పేస్వామి,నారాయణ స్వామి, హులియప్ప పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి ఇన్వర్టర్ అందజేత



ఇన్వర్టర్ అందజేస్తున్న విజయ్ పాఠశాల పూర్వ విద్యార్థులు

కంప్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరు సహాయ సేవలకు ముందుకురావాలని కాళికాదేవి ఆలయం సమితి సభ్యుడు రవిశేఖర్ పేర్కొన్నారు. మనం సంపాదించే సంపాదనలో కాస్తయినా అభివృద్ధి పనులకు సహాయ సేవలకు ముందుకొస్తే సమాజంలో ఎంతో గుర్తింపు వుంటుందని తెలిపారు. సోమవారం షుగర్ ఫ్యాక్టరీలో వుండే కాళికాదేవి ఆలయానికి విజయ్ ప్రభుత్వ పాఠశాలలో 2018 పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంజునాథ్ విశ్వనాథ్ సింగ్, సతీష్ రెడ్డి, వెంకటేష్, నారాయణ ఆలయానికి ఇన్వర్టర్ అందించారు. అమ్మవారికి ఆలయంలో నవరాత్రి సమయంలో ఆలయానికి వచ్చే మహిళలకు విద్యుత్‌లేని సమయంలో ఇబ్బందులు కలగకుండా పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి తామంతగా ఆలయానికి ఇన్వర్టర్ అందించామన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఓబులేష్, లక్ష్మన్న ఆలయ కమిటీ సభ్యులు సురేష్ చిట్టి, మోహన్ రావు, మంజునాథ్, వీరేష్ పురోహితులు సత్యనారాయణ రావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేశ్ కుమార్

గ్రీవెన్స్‌లో 511 అర్జీలు

హోసూరు (కృష్ణగిరి), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో పబ్లిక్ రిడ్రెస్సల్ గ్రీవెన్స్‌లో 511 అర్జీలు వచ్చాయి. సోమవారం ఏర్పాటైన సమావేశానికి కలెక్టర్ దినేశ్‌కుమార్ అధ్యక్షత వహించారు. శాఖల వారీ అర్జీలను విభజించి అర్హులైనవాటిని గడువులోగా పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఇదే సందర్భంగా జిల్లాస్థాయిలో ముఖ్యమంత్రి కప్ క్రీడాపోటీలలో గెలుపొందిన 2,212 మంది క్రీడాకారులను జిల్లా యువజన సంక్షేమం, క్రీడల అభివృద్ధి శాఖ తరపున సత్కరించారు. క్రీడాకారులకు రూ.44.41 లక్షల ప్రైజ్‌మనీ చెక్కులు, ప్రశంసాపత్రాలు అందచేసి అభినందించారు. వివిధ పథకాల లబ్ధిదారులకు చెక్కులు అందచేశారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కవిత, డిప్యూటి కలెక్టర్ (విద్యావిభాగం) కృతి కామ్న తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్క కరిచి తీవ్ర గాయాలు..

చికిత్స ఫలించక బాలుడి మృతి

హోసూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): హోసూరు శివారులోని మాసినాయకనపల్లెలోని ఒక ప్రైవేట్ గ్రీన్‌హౌస్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కుటుంబం ఉంటోంది. ఈనెల 1న తోటలో ఆటలాడుకుంటున్న వేళ మూడున్నరేళ్ల సత్యను వీధికుక్క కరిచింది. వెంటనే బాలుడిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స ఫలించక సోమవారం బాలుడు మృతి చెందాడు. దీంతో బాలుడి కుటుంబంలో విషాదం నెలకొంది. బాలుడికి రేబిస్ వ్యాధి సోకి ఉండవచ్చునే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. కాగా హోసూరు నగరంలో ఇటీవల వీధికుక్కల దాడులు అధికమయ్యాయని వాటికి అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యర్థాల సంస్కరణకు శ్రీకారం

హోసూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాలలో సేకరించిన వ్యర్థాలను సంస్కరించే ప్రక్రియకు సోమవారం శ్రీకారం చుట్టారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ఈ పనులు చేపట్టారు. దాచేపల్లి ఎరువుల ఫ్యాక్టరీలో రూ.3.19 కోట్లతో బయోమైనింగ్ పద్ధతిలో సంస్కరణ ఉంటుందని మేయర్ సత్య తెలిపారు. 41,400 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను సంస్కరించనున్నట్టు తెలిపారు. కార్పొరేషన్ కమిషనర్ షబ్బీర్ ఆలం, డిప్యూటి మేయర్ ఆనందయ్య, ఆరోగ్య స్థాయి సమితి చైర్మన్ మాదేశ్వరన్ పాల్గొన్నారు.



వ్యర్థ నియంత్రణ యంత్రాలను ప్రారంభిస్తున్నమేయర్ సత్య

వీరశైవ లింగాయత్‌లుగా నమోదు చేసుకోవాలి

● జిల్లా అధ్యక్షుడు మహేశ్వరయ్యస్వామి

బళ్లారి సిటీ, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కుల సర్వేలో మతం కాలమ్‌లో హిందూ అని, కులకాలమ్‌లో వీరశైవ లింగాయత్ అని పేర్కొనాలని సంఘం జిల్లా అధ్యక్షులు మహేశ్వరయ్యస్వామి అన్నారు. నగరంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి లేదా సిద్దరామయ్యకు మతం గురించి తెలుసుకునే అధికారం లేదని, కేంద్ర ప్రభుత్వానికి మతాన్ని గుర్తించే అధికారం ఉందని అన్నారు. కొంతమంది వీరశైవగా రాస్తే, మరికొందరు లింగాయత్‌గా రాస్తారు. ఇది ఆట కాదు అన్ని వర్గాలు వీరశైవ లింగాయత్‌గా రాయాలని అన్నారు. కుల గణనకు రూ.420 కోట్ల రుపాయలు అవసరం లేదని ఇది సమయం డబ్బు వృథా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద అన్ని పత్రాలు ఉన్నాయని వారి నుంచి సమాచారాన్ని పొందవచ్చని ఆయన అన్నారు.పాఠశాలలు,కళాశాలల ,విశ్వవిద్యాలయం వద్ద విద్యా సంబందిత సమాచారం ఉందని దానిని పొందవచ్చని, సర్వే నిర్వహించవచ్చన్నారు. కార్యక్రమంలో షడక్షరస్వామి, ప్రభుస్వా మి, దరూరు పురుషోత్తమగౌడ, సోమలింగనగౌడ, పంపాపతి, బండేగౌడ, తిప్పేరుద్రప్ప, చంద్రమౌళి, నాగరాజ్, గౌరీశంకర్ తదితరలున్నారు.



మాట్లాడుతున్న మహేశ్వరయ్యస్వామి

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

బళ్లారి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న నాగరాజు అనే నిందితుడిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బళ్లారి ఎస్పీ డాక్టర్ శోభారాణి ఆదేశాల మేరకు దొంగతనాలకు పాల్పడుతున్న నాగరాజును అరెస్ట్ చేశారు. దేవదుర్గం తాలుకా రాయచూరు జిల్లా చెందినవాడిగా గుర్తించి వారిని అదుపులో తీసుకుని రిమాండ్‌కు పంపారు. ఈ దాడిలో సిటీ డీఎస్పీ చంద్రకాంతనంద రెడ్డి, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రవిచంద్ర, ఇనస్పెక్టర్ వన్నూరప్ప, గాంధీనగర్ పోలీసులు పాల్గొన్నారు. విరుపాక్షప్ప, హెడ్ కానిస్టేబుల్‌లో జయరాం రామ్‌దాసు, నారాయణ, తిమ్మప్ప, కాళింగప్ప, మంజునాథ, విజయ్‌ని ఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న పోలీసులు

ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి తాండవం

● మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సిరుగుప్ప తాలుకాలో సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయం, నగర సభ కార్యాలయాల్లో అవినీతి విలయతాండవం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ఆరోపించారు. సోమవారం సిరుగుప్ప పట్టణం బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమలింగప్ప మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ తగ్గించడం హర్షణీయమన్నారు. 28 శాతం ఉన్న జీఎస్టీను 18 శాతంకు, 18 శాతం జీఎస్టీను 12 శాతంకు, 12 శాతం జీఎస్టీను 5 శాతంకు, ఐదు శాతం జీఎస్టీను 0 జీఎస్టీకు మార్చినట్లు తెలిపారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి దేశ ఆర్థిక రంగం 11వ స్థానం నుంచి 4వ స్థానానికి తీసుకువచ్చిన ఘనత మోదీదేనన్నారు.. తాలుకాలో ఎమ్మెల్యే బీఎం నాగరాజు అభివృద్ధి పనులపై మొగ్గు చూపడం లేదని ఆరోపించారు. తాలుకాలో ఎమ్మెల్యే ఉన్నాడో లేదో నని ఆయన ఎద్దేవా చేశారు. బీసీ కులగణన సమీక్షలో ప్రతి ఒక్కరు మొదట హిందూ అని నమోదు చేసి అనంతరం సబ్ కులాన్ని పూర్తి చేయించాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షులు కుంటనహళ్ మల్లికార్జునస్వామి, మాజీ అధ్యక్షులు మారెప్ప, ప్రముఖులు దొడ్డయ్య, సుబ్బయ్యశెట్టి, ఈరన్న గౌడ, కిరణ్ కుమార్ జైన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప